
క్లుప్తంగా

మరమ్మతుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు



నూకలవాడలో మరమ్మత్తులకు గురయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

బలిజిపేట: మండలంలోని నూకలవాడలో రెండు నెలల క్రితం పడిన పిడుగుపాటుకు బీసీ కాలనీలో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు పంటపొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తుల బారిన పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయమని రైతులు పలు పర్యాయాలు అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో పొట్టమీద ఉన్న వరిచేనుకు నీరు పెట్టుకోలేక పంట నష్టపోవలసి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 5 మోటార్ కనెక్షన్స్ ఉన్నాయి. సుమారు 50 ఎకరాలకు సాగునీరు సరఫరా జరగవలసి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు బాగు చేయాలని కోరుతున్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



ఇప్పిలివీధిలో వేస్తున్న సీసీ రోడ్డు

సాలూరు: మున్సిపాలిటీ పరిధి ఇప్పిలివీధిలో కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి చినబజార్ సెంటర్ వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గడప గడపకు... నిధులు రూ. 5 లక్షలతో 130 మీటర్ల మేర సీసీ రోడ్డు వేస్తున్నట్లు డీఈ శ్రీరామ్మూర్తి, ఏఈ సూరినాయుడు తెలిపారు. ఎట్టకేలకు వీధిలో సీసీ రోడ్డు వేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

భామిని: మండల కేంద్రంలో గణిత ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. భామిని, బత్తిలి, బాలేరు, పెద్దదిమిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల నుంచి 9,10 తరగతులకు చెందిన 79 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 10వ తరగతి నుంచి ఎల్.పవన్‌కుమార్(బాలేరు), ఎం.దామోదరనాయుడు(భామిని), వి.రజిత, జి.సాయిలక్ష్మి(మోడల్ స్కూల్), ఆర్.శిరీష(బత్తిలి) తొలి ఐదు స్థానాల్లో నిలిచారు. 9వ తరగతి నుంచి సీహెచ్.సంతోష్‌కుమార్, టి.సాయినిశాంత్, టి.సాయినిఖిల్, జి.కరుణశ్రీ(మోడల్ స్కూల్), కె.శేఖర్(పెద్దదిమిలి) విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎంపీపీ బొమ్మాళి భాను అన్నారు. మండలంలోని మంగళాపురం సమీపంలో నాగావళి నదీతీరంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణంలో ఆదివారం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. మండల, పట్టణ పరిధిలోని సచివాలయాల సిబ్బంది నాలుగు టీమ్‌లుగా ఏర్పడి తమ సత్తా చాటారు. తొలిత ఎంపీపీ బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభించారు. వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్‌తో పాటు ఎంపీటీసీ మజ్జి నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, జి.రాంబాబు తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు అందించారు.

నేడు ఎం.సింగుపురంలో జీజీఎంపీ

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పాలకొండ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రూ.1.32 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో రూ.1.32 కోట్ల వ్యయంతో జల్ జీవన్ మిషన్ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి, తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రస్తుతం పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి, మట్టితవ్వకాలు ఊపందుకున్నాయి. రేగిడి ఆమదాలవలస మండలంలోని సంకిలి దగ్గరున్న నాగావళి నది నీటిని ఇక్కడకు తరలించి, పైపులైన్ల ద్వారా కుళాయిలతో తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఈ పనులను మండల వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు ఆదివారం పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఓటే వజ్రాయుధం..

● జేసీ గోవిందరావు

సాలూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని జేసీ గోవిందరావు అన్నారు. మండలంలోని జీగిరాం పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024 జనవరి 1వ తేదికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ బాలమురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.



సాలూరు: జీగిరాంలో దరఖాస్తు తీసుకుంటున్న జేసీ గోవిందరావు

ప్రత్యేక ఓటరు నమోదు పరిశీలన

పార్వతీపురం/సీతానగరం: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని నర్సిపురం గ్రామంలో 54, 55, 56 పోలింగ్ కేంద్రాలను, సీతానగరం మండలం కేంద్రంలోని 111,144, 145, 146 పోలింగ్ కేంద్రాలను, సాలూరు మండలంలోని జీగిరాంలో 54వ పోలింగ్ కేంద్రాన్ని, పాచింపెంట మండల కేంద్రంలో 95,96 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఓటరు నమోదును పరిశీలించారు. ఓటరు నమోదు వివరాల గురించి బూత్‌స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఈనెల 4, 5 తేదీలలోను, డిసెంబర్ 2,3 తేదీలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 2024 జనవరి 1 నాటికి ఓటరుగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 27న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. ముసాయిదా జాబితాలో అభ్యంతరాలను డిసెంబర్ 9వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26నాటికి అభ్యంతరాలను పరిష్కరించనున్నామని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: లచ్చయ్యపేట పోలింగ్ కేంద్రంలో మాట్లాడుతున్న జాయింట్‌కలెక్టర్ ఆర్ గోవిందరావు

పార్వతీపురంలో ఆర్డీఓ పరిశీలన

పార్వతీపురం టౌన్: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని రెవిన్యూ డివిజనల్ అధికారి కె హేమలత పార్వతీపురంలో ఆదివారం పరిశీలించారు. ఈ మేరకు పట్టణంలోని 23,24,25,37,38,39 పోలింగ్ కేంద్రాలలో ఓటరు నమోదును పరిశీలించి బూత్ స్థాయి అధికారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్: ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

నేటి నుంచి పైడితల్లమ్మ జాతర

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బెలగాం గ్రామ ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి. అమ్మవారి ఆలయంలోని పైడితల్లమ్మకి వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలను, వారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తారని ఆలయ ప్రధాన పూజారి గౌరీశంకర ప్రసాద్ తెలిపారు. అదే రోజు ఉదయం 8 గంటల నుంచి బెలగాం గ్రామ, పట్టణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, గొర్లి కుటుంబ సభ్యులు, భక్తులతో వేదపండితులు హోమాలు చేయిస్తారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గుటల వరకు అమ్మవారి ఆలయంలో ఘటాలకు పూజలు చేస్తారు. అనంతరం సాయంత్రం గ్రామంలోని పలు వీధుల్లో మేళతాళాల మధ్య ప్రధాన పూజారి గౌరీ శంకర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపు నిర్వహిస్తారు. బుధవారం ఆలయం వద్ద అమ్మవారి విగ్రహ అనుపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



పూజలందుకునేందుకు సిద్ధంగా ఉన్న పైడితల్లి అమ్మవారు

సాగునీటి సరఫరాతో రైతుల్లో ఆనందం

సాక్షి ఎఫెక్ట్...

బలిజిపేట: మండలంలోని నారన్నాయుడువలస వద్ద ఉన్న నెమలాం–నీలాయివలస బ్రాంచి కాలు వ ద్వారా తోటపల్లి కాలువ నీరు సరఫరా కావడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. గతనెల 30వ తేదీన 'సాగునీరు అందక రైతుల ఆందోళన' అనే శీర్షికన సాక్షి దిన పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు కాలువ నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలుండడంతో పంటకు నష్టం వాటి ల్లకుండా చేతికి అందివచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగునీటికి అల్లాడిపోయామని, కాలువనీరు రావడంతో ఎంతో మేలు జరిగిందంటూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



నారన్నాయుడువలస వద్ద కాలువలో పారుతున్న నీరు

కొప్పల వెలమ సంక్షేమానికి కృషి చేయాలి

పార్వతీపురం: కొప్పుల వెలమ సామాజిక వర్గ సంక్షేమానికి, సంఘం అభివృద్ధికి, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘం గౌరవ అధ్యక్షుడు చుక్క భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భేషజాలకు పోకుండా స్నేహపూర్వకంగా పనిచేసి సంఘం భవన నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి అధ్యక్షుడిగా రమేష్‌నాయుడు, కోశాధికారిగా మరిశర్ల కార్తీక్‌నాయుడుతోపాటు పలువురు సభ్యులు ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం నాయకులు ద్వారపురెడ్డి జగదీష్, దత్తి లక్ష్మణరావు, జి.సుదర్శనరావు, డా.యాళ్ల వివేక్, ఎ.సూర్యనారాయణ, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు భాస్కరరావు

చేపల పెంపకంతో జీవనోపాధి



వీరఘట్టం: తెట్టంగి చెరువులో చేపపిల్లలు విడిచిపెడుతున్న మత్స్యకారులు

సీతంపేట: చేపల పెంపకంతో గిరిజన రైతులు జీవనోపాధి పొందాలని ఐటీడీఏ పీఓ రోసిరెడ్డి అన్నారు. మండలంలోని అక్కన్నగూడ, బుడ్డడుగూడ, రాజన్నగూడ, కంబగూడ, కిరప తదితర గ్రామాల పరిధిలో ఉన్న చెరువుల్లో ఆదివారం చేపపిల్లలు వేశారు. సోమగండి, పెద్దూరు, పాతపనుకువలస చెరువుల్లో మొత్తం 27,800ల చేపపిల్లలను విడిచిపెట్టినట్లు ఐటీడీఏ ఏపీఓ తెలిపారు. చేపల పెంపకంతో ఆదాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో పెద్దూరు సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి, సోమగండి వైస్ సర్పంచ్ బి.మంజుల, ఎంపీటీసీ చంద్రశేఖ ర్, ఎంపీఈఏ ప్రత్యూష పాల్గొన్నారు.

● **వీరఘట్టం:** మండలంలోని తెట్టంగి గ్రామంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ మత్స్యకారులకు సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో 2.17 లక్షల చేపపిల్లలు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలోని చెరువులో ఆదివారం ఈ చేపపిల్లలను విడిచిపెట్టారు. మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు.



సీతంపేట: చెరువులో చేపలు విడిచిపెడుతున్న ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి

సేంద్రియ ఎరువుల సరఫరా

గరుగుబిల్లి: తోటపల్లిలోని జట్టు ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నపూర్ణేశ్వరీ గిరిశక్తి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన సేంద్రియ ఎరువులు, కషాయాలను సరఫరా చేస్తున్నట్లు జట్టు ట్రస్టీ డి.పారినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తోటపల్లిలో రైతులతో తయారు చేయించిన ఘన జీవామృతం, వర్మీకంపోస్టును కడప, అడ్డతీగల, రంపచోడవరం తదితర ప్రాంతాలలో రైతులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా 17 మెట్రిక్ టన్నుల ఘన జీవామృతం, మూడు మెట్రిక్ టన్నుల వర్మీ కంపోస్టును పంపించినట్లు చెప్పారు.

పాత్రికేయ వృత్తి గౌరవ ప్రదం

● ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: సమాజంలో పాత్రికేయ వృత్తికి గౌరవప్రదమైన స్థానం ఉందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గల లయన్స్ కల్యాణ మంటపంలో ఏపీయూడబ్ల్యూజే పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండి ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి వార్తల సేకరణ చేసేది పాత్రికేయులేనని ప్రశంసించారు. సవాళ్లతో కూడుకున్న పాత్రికేయ వృత్తిలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కొత్తగా పాత్రికేయ రంగంలోకి వచ్చే వారు సీనియర్లను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని చెప్పారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇల్ల స్థలాలు మంజూరు చేసి వారి పక్షాన నిలిచిందన్నారు. అర్హులైన వారి జాబితా అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ మాట్లాడుతూ కరోనా సమయంలో వృత్తిలో భాగంగా ఎంతో మంది పాత్రికేయులు మరణించారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన జీఓను అమలు చేసేందుకు కృషి చేయాలని ప్రజా ప్రతినిధులను కోరారు. అలాగే జర్నలిస్టులందరికీ ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు మంజూరయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ లోచర్ల రమేష్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎస్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆచూరి శివ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్వీ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు డి.అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపీయూడబ్ల్యూజే పార్వతీపురం మన్యం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎ.కిశోర్ (డీడీ న్యూస్) ఉపాధ్యక్షుడిగా ఆశపు జయంత్‌కుమార్ (సాక్షి) కె.శ్రీనివాసరావు(ఎంఎం న్యూస్), జి.గోపాల్ (సూర్య), కార్యదర్శిగా గంగి శ్రీనివాసరావు (అక్షరసూర్య), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బత్తుల రాజశేఖర్ (వార్త), కోశాధికారిగా ఎ.అనంతరావు (విశాలాంధ్ర), సంయుక్త కార్యదర్శులుగా అల్లు నాయుడు (ఆంధ్రప్రభ), శ్రీనివాసరావు (విశాలాంధ్ర), యమ్మల రమణ (సూర్య), మరో 20 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

ఘనంగా దుర్గమ్మ పండగ

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో దుర్గమ్మ పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులంతా గ్రామ శివారులోని వేపచెట్టు వద్ద కొలువైన అమ్మవారి వద్దకు వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

రాజాం: మండలంలోని నందబలగ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొర్ను జ్యోతిని ఎమ్మెల్యే కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె విశాఖపట్నంలో ఓ ఆస్పత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటి వద్దనే కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం ఆమె వద్దకు వెళ్లి, ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నంనాయుడు ఉన్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

● జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ జ్యోతీబా పూలే ఆకాంక్షించే సామాజిక సాధికార న్యాయం చేతల్లో చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డాకుల చిన్నారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు వచ్చినప్పటికీ బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వంటి అనగారిన కులాలకు 'రాజ్యాధికారం' మాటలకే పరిమితమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా అవకాశం కల్పించడంతో పాటు ద్వారా సామాజిక న్యాయం సాధ్యమైందన్నారు. అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ బలహీన వర్గాలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కులగణన చేపట్టాలని కోరుతూ ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, రాష్ట్రంలో సమగ్ర కులగణన ప్రక్రియ చేపట్టాలని సీఎం జగన్ చరిత్రాత్మక నిర్ణయం సామాజిక సాధికారతపై ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు సత్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో సుదర్శన హోమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, పాలకొండ, వీరఘట్టం, పార్వతీపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
● రూ.2.54 కోట్లతో బీటీ రహదారులకు శంకుస్థాపన

కొమరాడ: గిరిజన గ్రామాల అభివద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే జరుగుతుందని, ప్రతీ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తుమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుణదతీలేసు పంచాయతీ శిఖవరం నుంచి పోడుగువలస వరకు బీటీ రహదారి నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కోటి రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే కెమిశీల నుంచి గాజులగూడ వరకు బీటీ రహదారి నిర్మాణానికి రూ.1.54 కోట్లు నిధులు మంజూరు చేసింది. రహదారి పనులకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని, ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిని కనీసం పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థల ద్వారా మారుమూల గిరిజన గ్రామంలో ఉన్నా సంక్షేమ పథకాలు గడప వద్దకే వచ్చి చేరుతున్నాయన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు పట్టాలు మంజూరు చేయడంతో పాటు వారికి రైతుభరోసా అందిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మఒడి, చేదోడు వంటి పథకాలు అందిస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ తోడ్పాటు అందిస్తున్నారన్నారు. పార్టీలు చూడకుండా.. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శెట్టి మధుసూదనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్ బాబు, పార్టీ జిల్లా ట్రెజరర్ కళింగి మల్లేశ్వరరావు, కొమరాడ, శివిని పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, సర్పంచ్‌లు తాండింగి బీమయ్య, కద్రక నందిని, తదితరులు పాల్గొన్నారు.

గాజులగూడ రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ప్రకృతిపై పాఠ్యాంశాలు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా బాలలకు పాఠ్యాంశాలను రచించడం జరుగుతుందని ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ కన్సల్టెంట్ డా. డి.పారినాయుడు అన్నారు. మండలంలోని జట్టు ట్రస్టు ప్రాంగణంలో బాల సాహిత్య రచయితలు, విశ్లేషకులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించారు.